క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో వీరభద్రుని జన్మదినోత్సవం



పంచారామ క్షేత్రంలోని వీరభద్రస్వామి

సామర్లకోట: స్థానిక పంచరామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో కొలువై ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో గురువారం స్వామి జన్మదినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే జగదీశ్ మోహనరావు, సభ్యులు చీమల కొండ వీరభద్రప్రసాదరావు, తాతపూడి అరుణ్ వంశీ, గొల్తి సత్యనారాయణ, అలోక్ చంద్రజైన్, కంచర్ల సుష్మమోహిని, కొండపల్లి సత్యవాణి, మందపల్లి భానువెంకటపద్మ, బాడితమాని లక్ష్మి, గోనిపాటి బుల్లెమ్మ పాల్గొన్నారు. ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందరరామయ్య, వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజాదికాలు నిర్వహించారు.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ ప్రారంభం



మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించిన ఎంఈవో శివరామకృష్ణయ్య తదితరులు

సామర్లకోట: మండలం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా కె.ప్రసూన, ముఖ్య అతిథిగా నిమ్మకాయల రంగనాగ్, బలుసు వాసు, కంటే బాబు, అడబాల కుమార్ స్వామి, గుమ్మళ్ల రామకృష్ణ, దొరబాబు, పాలికి కుసుమ, కిరణ్, ఎంఈఓ శివరామకృష్ణ, పుల్లయ్య పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు మంచి ప్రతిభతో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పేరు తీసుకురావాలని రంగనాగ్ కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నీలా కోటేశ్వర రావు, సుధారాణి, వై.బంగార్రాజు, వెంకటేశ్వర్లు, రవి, వీరబాబు, రఘురాం, అరుణ, వరలక్ష్మి, గోవిందు, కళ్యాణి, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



కొత్తపల్లిలో లక్ష బిల్వార్చన చేస్తున్న స్వాములు

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న శ్రీధర్మశాస్తా ఆలయం వద్ద గురువారం రాత్రి అయ్యప్ప స్వామికి లక్ష బిల్వార్చన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పదునెట్టాంబడి ఏర్పాటు చేసి స్వామివారి పూజ నిర్వహించారు. మాలధారులు పాల్గొన్నారు.

రెండో బ్యాచ్‌కు శిక్షణ ముగింపు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీఓలకు నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా గురువారం రెండవ బ్యాచ్ శిక్షణ ముగిసింది. 11 జిల్లాల నుంచి 402 మందికి శిక్షణ ఇవ్వవలసి ఉండగా రెండు బ్యాచ్‌లలో 80 మందికి శిక్షణ పూర్తి చేశారు. ప్రస్తుతం కేంద్రంలో మూడో, నాలుగో బ్యాచ్ శిక్షణలు జరుగుతున్నాయి.

సమాజ మానసిక వికాసానికి కృషి

బాలాజీచెరువు: సమాజ మానసిక ఆరోగ్య ప్రయోజనం కోసం అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కృషి చేస్తుందని ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ పాలపర్తి సుబ్బారావు పేర్కొన్నారు. బాలా త్రిపురసుందరి ఆలయం వద్ద అలయన్స్ కార్యాలయంలో గురువారం సమాచార పత్రాలను ఆయన ఆవిష్కరించారు. అక్టోబర్ 4 నుంచి 12 వరకు మానసిక ఆరోగ్యంపై అవగాహన వారోత్సవాలను జాతీయ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ వింజరపు జనార్దనం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం అడ్వయిజర్ డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వంద కోట్లకు పైగా ప్రజలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, ప్రతి ఏడుగురిలో ఒకరికి ఈ సమస్య ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందని తెలిపారు. మానసిక ఆరోగ్యం బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, సమస్యలను గుర్తించడం, పరిష్కార మార్గాలను సూచించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

అనుమతులు వచ్చాకే ధమాల్..



మూసివేసిన బాణసంచా తయారీ దుకాణం

- బాణసంచా తయారీకి బ్రేకులు
- దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- రాయవరం ఘటనతో అప్రమత్తం
- వరుస వానలతో ఇప్పటి వరకు తయారీకి అవాంతరాలు
- ఈ లోపు మార్కెట్‌ను ముంచెత్తుతున్న శివకాశీ బాణసంచా

సామర్లకోట: దీపావళి వస్తోందంటే వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రం అందరికీ గుర్తొస్తుంది. ఇది ఒక కుటీర పరిశ్రమగా కొనసాగుతోంది. ఈ పరిధిలో 8 దుకాణాలు శ్వాశ్వత లైసెన్సుతో బాణసంచా తయారు చేసేవారు. బాణసంచా తయారీ దుకాణాల్లో వరుస ప్రమాదాలు సంభవిస్తుండడంతో క్రమేణా వేట్లపాలెంలో నాలుగు, సామర్లకోటలో ఒకటి దుకాణంలో మాత్రమే శాశ్వత లైసెన్సుతో ఏడాది పొడవునా బాణసంచా తయారు చేస్తున్నారు. కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన అగ్నిప్రమాదంతో ఇక్కడి బాణసంచా తయారీకి బ్రేక్ పడింది. ఆ ప్రమాదం నేపథ్యంలో గురువారం సామర్లకోట, పెదపూడి తహసీల్దార్ల ఆధ్వర్యంలో వేట్లపాలెంలోని నాలుగు, సామర్లకోటలోని బాణసంచా తయారీ దుకాణాల్లో తనిఖీ చేశారు. కలెక్టరు నుంచి అనుమతులు వచ్చే వరకు తయారీ నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రతి దుకాణంలో పని చేసే 10 నుంచి 15 మంది వరకు కూలీలకు ఉపాధి లేకుండా పోయింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బాణసంచా పోటీల్లో అనేక ఇక్కడి ఉత్పత్తులకు అనేక బహుమతులు వచ్చాయి. దీంతో వేట్లపాలెంలో మూడు, జి. మేడపాడులో ఒక దుకాణం, పెద్దాపురం మండలం జి.రాంగపేటలో రెండు, గోరింటలో ఒక దుకాణంలో బాణసంచా తయారీకి శాస్వత లైసెన్సులు ఉన్నాయి.



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

శివకాశీ ఉత్పత్తుల జోరు

దీపావళిని పురస్కరించుకుని శివకాశీ నుంచి బాణసంచా కొనుగోలు చేసి విక్రయించడానికి చాలా మంది తాత్కాలిక లైసెన్సులు తీసుకుంటారు. వేట్లపాలెంలో తయారీ లేకపోవడంతో శివకాశీ బాణసంచాకు డిమాండ్ పెరుగుతోంది. వాటి విక్రయాల్లో లాభాలు సైతం ఎక్కువని వ్యాపారులు అంటున్నారు. సుమారు మూడు నెలలుగా వర్షాలు కురవడంతో బాణసంచా తయారీకి అవరోధాలు ఏర్పడినట్టు స్థానిక తయారీదారులు అంటున్నారు.

తయారీ కేంద్రాల్లో తనిఖీ



సామర్లకోట మండలంలోని బాణాసంచా తయారీ షాపులను తనిఖీ చేసిన రెవెన్యూ అధికారులు

సామర్లకోట: మండల పరిధిలోని బాణసంచా తయారీ దుకాణాలను రెవెన్యూ అధికారులు గురువారం తనిఖీ చేశారు. స్థానిక తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, పెదపూడి తహసీల్దార్ సీతాపతిరావుల ఆధ్వర్యంలో హుస్సేన్‌పురంలోని బాణసంచా దుకాణం, వేట్లపాలెం, జి.మేడపాడులోని బాణసంచా తయారీ దుకాణాలను వారు తనిఖీ చేశారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. దుకాణాల్లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాల పనితీరును పరిశీలించి, వాటి వినియోగంపై దుకాణాల్లోని సిబ్బందికి అవగాహన ఉండాలని, నీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనుభవం లేని వ్యక్తులను బాణసంచా తయారీలో పెట్టుకోవద్దని, కార్మికుల హాజరు పట్టీ కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే కార్మికులకు బీమా చేయించాల్సిన బాధ్యత యజమానుల దేనని అన్నారు. ప్రతి దుకాణంలో ప్రభుత్వ నిబంధనల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బాణసంచా గోదాములను తయారీ ప్రదేశానికి దూరంగా ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సూచించారు. అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేసేవారిపై పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో ఎటువంటి లోపాలు లేనట్టు గుర్తించారు. అలాగే సామర్లకోట టౌన్ శ్రీ బాబా ఫైర్ వర్క్స్ తాతపూడి చిన్ని తయారీ యూనిట్‌లో కార్మికులకు బీమా చేయించలేదని, ఫైర్ ఎన్‌వోసి కూడా కాలపరిమితి దాటిపోయిందని గుర్తించారు. ఈ కేంద్రంలో తయారీని నిలిపివేసినట్టు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ



80 ఏళ్ల నుంచి పూర్వీకుల నుంచి వారసత్వంగా బాణసంచా తయారు చేస్తున్నాం. ప్రస్తుతం మా తండ్రి హరిబాబు పేరున లైసెన్సుతో సరకు తయారుచేస్తున్నాం. వరుస వర్షాలతో ఆపిన తయారీని రెండు రోజులుగా ఎండలు కాయడంతో మళ్లీ ప్రారంభించాలనుకున్నాం. రాయవరం ఘటనతో కార్మికులకు సెలవు ఇచ్చాం. కార్మికులకు బీమా ప్రక్రియ సాగుతోంది. కలెక్టరు నుంచి అనుమతులు వచ్చే వరకు తయారీ ఆపాము.

– కోసన బాబ్జీ, బాణసంచా తయారీదారు, వేట్లపాలెం

తదుపరి ఉత్తర్వులు ఇచ్చాకే..



రాయవరం ప్రమాద ఘటన నేపథ్యంలో కలెక్టర్ నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు బాణసంచా తయారీ నిలిపివేయాలని ఆదేశాలిచ్చాం. మండల పరిధిలో తయారీ దుకాణాలను తనిఖీ చేసి వారికి సూచనలిచ్చాం. రిమోట్ ఉపయోగించి కాల్చే బాణసంచా వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించాం. అయితే వీటి తయారీ మండలంలో లేనప్పటికీ అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి.

– కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్, సామర్లకోట

తపాలా సేవల ప్రాధాన్యం తెలుసుకోవాలి

- విద్యార్థులకు జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్ పిలుపు
- ముగిసిన ఫిలాటెలీ ప్రదర్శన
- విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్

బాలాజీచెరువు: నేటి తరానికి తపాలా శాఖ సేవల ప్రాధాన్యాన్ని తెలియజేయాలని జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో రెండు రోజుల పాటు నిర్వహించిన తపాలా బిళ్లల ప్రదర్శన గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో అత్యద్భుతమైన, అతి ప్రాచీనమైన, వివిధ రకాల మేలైన, అరుదైన స్టాంపుల సేకరణ సమాహారమే ఈ ప్రదర్శన అని, అన్ని పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఔత్సాహికులు పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ ప్రదర్శనలో ఎప్పుడూ చూడని అరుదైన స్టాంపులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి. శివ నాగరాజు మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు ఫిలాటలీ పట్ల అవగాహన కల్పించారు. ఇలాంటి ప్రదర్శనలు తరచూ జరుగుతూ ఉంటే ఫిలాటలీ కళ ఎప్పటికీ సజీవంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అత్యుత్తమ ప్రదర్శనలను పారదర్శకంగా ఎంపిక చేసిన జ్యూరీ, న్యాయ నిర్ణేతలు అనుప్ కుమార్ రౌత్, దేవేందర్ కుమార్ జైన్ మాట్లాడుతూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని, విజేతలుగా నిలిచిన వారందరికీ, పాఠశాలల యాజమాన్యం, అధ్యాపకులు పిల్లలకు ఈ కళ పట్ల అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ప్రదర్శనలో గెలుపొందిన ఫిలాటలిస్టులకు, ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల విజేతలకు వీసీ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

అజొల్లాపై రైతులకు అవగాహన



అజోల్లా పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: వ్యవసాయ, పశు సంవర్థక శాఖలు, ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పండూరు గ్రామంలోని రైతులకు అజోల్లా పెంపకంపై గురువారం శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన కొప్పిశెట్టి శ్రీను వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సత్యనారాయణ అజోల్లా గురించి రైతులకు వివరించారు. సంపూర్ణ సమీకృత దాణా గురించి వివరించి అజోల్లా బెడ్‌ను 12 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు వైశాల్యం ఉండేలా చేసుకోవాలన్నారు. దానిలో 300 జీఎస్ఎం షీట్ వేసుకుని ఒక అంగుళం మేర మట్టి, 5 కేజీల ఆవుపేడ, నాలుగు అంగుళాల ఎత్తులో నీరుతో నింపుకొని అజోల్లా యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాగ్రత్తగా కాపాడుతూ ఉంటే 10 నుంచి 15 రోజుల్లో పెరుగుతుందని, రోజుకు ఒక కిలో చొప్పున అజోల్లా తీసుకుని శుభ్రంగా కడిగి పశువుల దాణాలో పెడితే పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. అజోల్లాను కోళ్లకు పెట్టడం వాటి పరిమాణం, గుడ్ల పరిమాణం సైతం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి బర్రె నాగేశ్వరరావు, ఏఈఓ రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాపారత్నం, రాజు, అరుణ, రైతులు శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అట్లతద్ది పూజలు



ఉండూరు గ్రామంలో చెరువు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: మండలంలోని ఉండూరు గ్రామంలో అట్లతద్దిని పురస్కరించుకొని మహిళలు, యువతలు గోరింటాకు పెట్టుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష చేసి చంద్రుడు వచ్చిన తర్వాత గోదావరి కాలువలు, చెరువుల వద్దకు వెళ్లి గౌరీ పూజలు చేశారు. ఈ సందర్భంగా వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. హుస్సేన్‌పురంలో అట్లతద్దిని ఘనంగా నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలోని మహిళలు గురువారం అట్లతదియను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం వాయినాలు, దేవునికి నైవేద్యాలు పూర్తి చేసుకుని గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా ఉన్న చెరువులు, కాలువల వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. చెట్లకు ఊయల కట్టుకుని పాటలుపాడుతూ ఊగారు. చిన్న, పెద్ద తేడా లేకుండా మహిళలు అందరూ ముందురోజు గోరింటాకు పెట్టుకుని తదియ నాడు కొత్త దుస్తులు ధరించి ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా పెళ్లి కానివారికి గుణవంతుడైన భర్త రావాలని, పెళ్లయిన వారు పండంటి బిడ్డ కలగాలని సౌభాగ్యంతో ఎల్లకాలం వర్ధిల్లాలని గౌరిదేవిని పూజించారు. నవగ్రహాలలో ఒకటైన కుజుడికి అట్లంటే మహా ప్రీతి. ఆయనకు అట్లను నైవేద్యంగా పెట్టి భక్తిశ్రద్ధలతో పూజించి అనంతరం 11 మంది ముత్తైదువులకు 11 అట్లు, పళ్లు, పసుపు-కుంకుమ అందజేసి వారి దీవెనలు పొంది వాయినాలను సమర్పించారు.

వైఎస్సార్ విగ్రహాన్ని మూసేశారు



ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని జనసేన ఫ్లెక్సీలతో మూసివేసిన దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లోని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని జనసేన నేతలు ఫ్లెక్సీలతో మూసేశారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ బహిరంగ సభ పురస్కరించుకుని ఆ పార్టీ నేతలు బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఉన్న ఆ విగ్రహం కనపడకుండా ఫ్లెక్సీలు కట్టేశారు. నిర్వహించిన సభకు భారీ సంఖ్యలో జనం రాకపోవడంతో సభ వెలవెలబోయింది. పోలీసులు మాత్రం బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఉన్న మూడు రోడ్లలో బారికేడ్లు, గ్యాలరీలను ఏర్పాటు చేసినా జనం మాత్రం రాలేదు.

కంటిని కాపాడుకుందాం

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ కంటివైద్య నిపుణుడు శ్రీకాంత్ అన్నారు. స్థానిక రామారావుపేటలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు

- ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ
- విద్యార్థుల్లో వెల్లివిరిసిన క్రీడోత్సాహం
- వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్‌లో ఎంపికలు
- డివిజన్ స్థాయికి పలువురి ఎంపిక



ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలకు హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో గురువారం స్థానిక డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన కాకినాడ అర్బన్ ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కేవీవీ సత్యనారాయణ, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి డివిజన్ ఎంపికల ఇన్‌చార్జి, సీనియర్ పీడీ పట్టాభిరాం అధ్యక్షత వహించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ చాంపియన్‌షిప్, సెలక్షన్ ట్రైల్ నిర్వహించారు. డివిజన్ పరిధిలో 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉపవిద్యాశాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ఐ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ నూతన క్రీడాపాలసీ ప్రకారం స్పోర్ట్స్ కోటాలో 3 శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పిస్తుందని, క్రీడలను అశ్రద్ధ చేయకుండా, చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అండర్-17 వాలీబాల్ విన్నర్స్‌గా పీఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, రన్నర్స్‌గా నారాయణ పాఠశాల విద్యార్థులు నిలిచారన్నారు. అండర్-14 వాలీబాల్‌లో ప్రథమస్థానం పీఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ద్వితీయస్థానంలో జగన్నాథపురం దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నిలిచారన్నారు. వీరు నవంబరులో జరిగే స్కూల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. ఎంపికల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గాదేవి, రాజేశ్వరి, మౌనిక, కుమారి, మస్తానీ, మేరీ, బీవీ ప్రసాద్, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.



చెస్ విభాగంలో డివిజన్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

మండల స్థాయి ఎంపికలు పూర్తి



కాకినాడ జిల్లా క్రీడామైదానంలో గురువారం మండలస్థాయి ఎంపికలు న్విహించాం. వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనపరచిన వారిని డివిజన్ స్థాయికి ఎంపిక చేశాం.

– పట్టాభి, సీనియర్ పీడీ, ఎంఎస్‌డీఏ

చెస్‌లో ప్రథమస్థానం




నా పేరు షేక్ అబ్దుల్ ఖాదర్ షరీఫ్. కాకినాడలోనే తొమ్మిదో తరగతి చదువుతున్నాను. నేను మూడేళ్లుగా చెస్ నేర్చుకుంటున్నారు. గత ఏడాది రాష్ట్రస్థాయిలో ఆడాను. మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలువడం ఆనందంగా ఉంది.

బ్యాడ్మింటన్‌లో మండల స్థాయికి



నా పేరు రెహమత్ ఉన్నీసా బేగమ్. 8వ తరగతి చదవుతున్నాను. చిన్నతనం నుంచి బ్యాడ్మింటన్ అంటే ఇష్టం. గత ఏడాది ఎస్‌జీఎస్ఐ పోటీలలో జిల్లాస్థాయిలో పాల్గొన్నాను. ఇప్పుడు మండలస్థాయి నుంచి డివిజన్ స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

ముమ్మనకు దవులూరి పరామర్శ



ప్రకాష్‌ను పరామర్శిస్తున్న దవులూరి దొరబాబు, నాయకులు

సామర్లకోట: పితృ వియోగంతో బాధపడుతున్న పెద్దాపురం పట్టణ వైఎస్సార్ సీపీ కార్యదర్శి ముమ్మన ప్రకాష్‌ను గురువారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు పరామర్శించి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రకాష్ తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

నేడు హుండీల లెక్కింపు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని హుండీలను శుక్రవారం ఉదయం లెక్కించనున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం, ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే జగదీష్‌మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసంలో హుండీల ద్వారా ఆదాయాన్ని ప్రత్యేకంగా తెలుసుకోవడానికి ముందుగా ఏటా హుండీల లెక్కింపు జరుగుతుంది. దీనిలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు, భక్తులు హుండీల లెక్కింపులో పాల్గొన్నాలన్నారు.